
క్లుప్తంగా

మేయర్ వినాయకచవితి శుభాకాంక్షలు



నెహ్రూనగర్: వినాయకచవితి నుంచి ప్రజల విఘ్నాలు తొలగి ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు ఆకాంక్షించారు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సహజ సిద్ధమైన మట్టి ప్రతిమల్ని పూజించి, పర్యావరణ హిత వినాయక చవితిని జరుపుకోవాలని ఆయన సూచించారు.

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు



కొరిటెపాడు(గుంటూరు): వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలందరికీ శాసనమండలి సభ్యులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుని కరుణా కటాక్షాలతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని అభిలషించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా ప్రయోజన పనులు, అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలకు విఘాతం కలుగకుండా చూడాలని వినాయకుడిని వేడుకున్నారు.

నేడు నగరపాలక సంస్థ స్పందన రద్దు

నెహ్రూనగర్: వినాయకచవితి పండుగను పురస్కరించుకుని సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని ఆమె సూచించారు.

మద్యం మత్తులో స్నేహితుడిపై హత్యాయత్నం



గణేష్

గుంటూరు ఈస్ట్: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు స్నేహితుడిపై హత్యాయత్నం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేవీపీ కాలనీకి చెందిన గణేష్ స్నేహితులు నాని, రమేష్ వద్ద రూ.2 వేలు అప్పుగా తీసుకున్నాడు. డబ్బు తిరిగి చెల్లించకుండా ఇద్దర్నీ ఇబ్బందికి గురిచేశాడు. ఆదివారం గణేష్ ఆనంద్ భవన్ హోటల్ సమీపంలో ఉండగా, మద్యం తాగి వచ్చిన నాని, రమేష్ అతడితో గొడవ పడ్డారు. చాకుతో గణేష్ గొంతు కోసి పరారయ్యారు. ట్రాఫిక్ పోలీసులు అతడ్ని 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గణేష్‌కు ప్రాణాపాయం తప్పింది.

పాత కక్షల నేపథ్యంలో దాడి

పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై ముగ్గురు దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వికలాంగుల కాలనీకి చెందిన కటకం పద్మారావు ద్విచక్ర వాహనంపై ఆదివారం ఇంటికి వెళ్తుండగా కేవీపీ కాలనీ వద్ద చెంబేటి వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, మణికంఠ రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. ద్విచక్ర వాహనాన్ని కాలువలోకి తోశారు. పద్మారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.






పండుగ వచ్చింది... సందడి తెచ్చింది

నగరంలో వినాయక చవితి సందడి నెలకొంది. రోడ్లన్నీ పూలు, పత్రి దుకాణాలతో నిండిపోయాయి. ఆదివారం నగరంలోని మార్కెట్ సెంటర్, బ్రాడీపేట, అరండల్‌పేట, లక్ష్మీపురం, కొరిటెపాడు, బృందావన్ గార్డెన్స్, పట్నంబజార్, కొత్తపేట, పాత గుంటూరు తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలు, పూలు, అరటి బోదెలు, పూజ సామగ్రి అమ్మకాలు జోరుగా కొనసాగాయి. కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి.

-సాక్షి ఫొటోగ్రాఫర్ / పాత గుంటూరు





అవోపా ఆధ్వర్యంలో పేదలకు పింఛన్ల పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్-ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) కార్యాలయంలో ఆదివారం పేదలకు పింఛన్లు, నిత్యావసర సరుకుల్ని పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ బిల్డర్ కేసీహెచ్ అంకారావు మాట్లాడుతూ పేదలకు విలువైన సేవలు అందించడంలో అవోపా కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 108 మంది పేదలకు ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున నగదు, రూ.వెయ్యి విలువగల నిత్యావసర సరుకుల్ని పంపిణీ చేశారు. పేద విద్యార్థికి చదువు నిమిత్తం రూ.10వేలు ఉపకార వేతనాన్ని అందజేశారు. అనంతరం ప్రముఖ వైద్యుడు కె. రామలింగేశ్వరరావు పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, కార్యదర్శి వెచ్చా రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, కొత్తమాసు సుధాకర్, మద్ది సాయి రమేష్, మహిళా విభాగ అధ్యక్షురాలు చింతా వసంత కల్పన, నాళం కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక మహోత్సవం



డాన్స్ మాస్టర్ చంటిని సత్కరిస్తున్న కల్యాణ్ తదితరులు

పాత గుంటూరు: రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాన్స్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్యాణ్ ఆధ్వర్యంలో ఆదివారం సాంస్కృతిక మహోత్సవం- 2 ఉత్సాహంగా సాగింది. కార్యక్రమానికి సక్కు మాధవి అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి డాన్స్ స్కూల్స్ చిన్నారులు పాల్గొన్నారు. లారెన్స్ గ్రూప్ డాన్స్ (దివ్యాంగులు), వెరైటీ డాన్స్, క్లాసికల్ డాన్స్, వెస్టర్న్ డాన్స్ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. శివ మిమిక్రీ ఉత్సాహపరిచింది. శరణ్య, విజయసాయి ఆలపించిన పాటలు అలరించాయి. అనంతరం డాన్స్ మాస్టర్ చంటి, డాన్సర్లకు మెమెంటోలను అందించి, సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామికి నివాళి



పెరియార్ రామస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

నెహ్రూనగర్: బహుజనుల చైతన్యం కోసం అహర్నిశలు శ్రమించిన గొప్ప పోరాట యోధుడు పెరియార్ రామస్వామి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పెరియార్ రామస్వామి జయంతిని పురస్కరించుకుని పాత గుంటూరులో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బహుజనుల చైతన్యం కోసం రామస్వామి జీవితాంతం పాటుపడ్డారని తెలిపారు. స్త్రీలు, పురుషులను సమానంగా పెంచాలని, ఉన్నత చదువులు చదివించాలని సూచించారన్నారు. మూఢ నమ్మకాలు, అశాస్త్రీయ భావాల్ని పారదోలి బహుజనులను చైతన్య పరిచిన గొప్ప నాయకుడు పెరియార్ అని కొనియాడారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో ధర్నా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 20, 21వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ధర్నాను మాలలంతా విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం 'హలో మాల.. చలో ఢిల్లీ' కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం కాలం చెల్లిందని, కాని కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి అన్నదమ్ముల్లా కలసి ఉన్న మాల, మాదిగల్ని విడగొట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గోదా జాన్‌పాల్, దారా హేమప్రసాద్, సొంగా వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా మోదీ జన్మదినోత్సవం



మోదీ ఫొటోతో బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా బీజేపీ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పలు కార్యక్రమాలు జరిగాయి. గుంటూరు కొత్తపేట ఆంజనేయస్వామి దేవస్థానం, మల్లికార్జునపేట మల్లికార్జునస్వామి దేవాలయం, డొంక రోడ్డు రామాలయం, నల్లచెరువు మూడు బొమ్మల సెంటర్ శివాలయం, అశోక్‌నగర్ విఘ్నేశ్వర దేవాలయాల్లో ఆ పార్టీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో సెల్ఫీ విత్ మోదీ కార్యక్రమం పేరుతో ఆయన చిత్రపటంతో బీజేపీ నేతలు సెల్ఫీ దిగారు. పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, జూపూడి రంగరాజు, పాటిబండ్ల రామకృష్ణ, వెలగలేటి గంగాదర్, ఈమని మాధవరెడ్డి పాల్గొన్నారు.

మట్టి వినాయకుడ్ని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడదాం

బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6,300 మట్టి వినాయకుడి ప్రతిమల పంపిణీ



పట్టాభిపురంలో ప్రతిమలు అందిస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

నగరంపాలెం: మట్టి వినాయకుడిని మనసా వాచా కర్మణా పూజించి, రాష్ట్రమంతటా ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ముందడుగు వేద్దామని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. 'మట్టి వినాయకుడిని పూజిద్దాం' అనే నినాదంతో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి గణపతి ప్రతిమల పంపిణీ అట్టహాసంగా జరిగింది. గుంటూరు నగరంలోని పట్టాభిపురంలో 4,500, పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో 1,300, దండమూడిలో 500 మట్టి వినాయకుని ప్రతిమలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ వినాయకచవితి పర్వదినానికి- ప్రకృతికి అవినాభావ సంబంధం ఉందని, దాన్ని మన పూర్వీకులు వేల సంవత్సరాల క్రితమే ఆచారంగా అందించారని తెలిపారు. గణేశుని పూజా విధానంలో అనేక ఆయుర్వేద నియమాలు, ఆరోగ్య సూత్రాలు, పలు రకాల వ్యాధులకు ముందు జాగ్రత్తలు నిక్షిప్తమై ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలంతా మట్టి గణపతి ప్రతిమను పూజించడం ద్వారా పండుగ మరింత శోభాయమానంగా విరాజిల్లుతుందని చెప్పారు. దీంతో ప్రాకృతిక పూజా ద్రవ్యాలు, సంబరాలతో సంపూర్ణ పర్యావరణహితంగా మారుతుందని వివరించారు. గణనాథుడి పండుగను పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీని నిలపాలని సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు దృష్ట్యా రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణ మద్దతు, సహకారాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. గత రెండేళ్లుగా మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తు న్నామని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో బజరంగ్ డైరెక్టర్లు జి.సుబ్బారావు, ఎస్.శ్రీనివాసరావు, ఎస్.సమీర్‌నందన్, కార్యనిర్వాహక బృందం, మామిళ్లపల్లి, దండమూడి గ్రామస్తులు పాల్గొన్నారు.

గణనాథుడి దీవెనలతో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలి

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరిఫాతిమా



మట్టి వినాయకుని విగ్రహాలను పంపిణీ చేస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: ప్రథమ దేవుడు చల్లని దీవెనలతో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని, అన్ని విఘ్నాలు తొలగిపోయి అందరికీ మేలు చేకూరాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా ఆకాంక్షించారు. వినాయకచవితిని పురస్కరించుకుని ఆదివారం బ్రహ్మానందరెడ్డి స్టేడియం, కాకాని రోడ్డులోని మహంకాళీ అమ్మవారి ఆలయం సమీపాన, నెహ్రూనగర్ ప్రాంతాల్లో గో గ్రీన్ అనే నినాదంతో రెండు వేల మట్టి గణపయ్య విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ చేసకునే పండుగ వినాయకచవితి అని చెప్పారు. నవరాత్రులు పూజించి.. చిన్నారి నుంచి వృద్ధుల వరకు ఎంతో సంబరాల నడుమ ఆది దేవుడి ఊరేగింపు నిర్వహిస్తారని తెలిపారు. పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యర్రి ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేతలు యర్రబాబు, పల్లా శ్రీను, రాందాస్, భాస్కర్, కెల్విన్, శ్రీకాంత్‌రెడ్డి, మీరావలి, గణేష్, రాజా, రాజశేఖర్, మద్రాసు మాధవరావు, చెన్నంశెట్టి బాబు పాల్గొన్నారు.

'హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వివరణలో నిజం లేదు'

గుంటూరు మెడికల్: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో రిజిస్ట్రార్ డాక్టర్ రాధికరెడ్డి విడుదల చేసిన ప్రతిక ప్రకటన అసత్యమని మెడికో పేరెంట్స్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం గుంటూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో 53,857 ర్యాంకు సాధించిన బీసీ (ఏ) అభ్యర్థికి రిజర్వేషన్ కేటాగిరిలో సీటు కేటాయించి, 60,407 ర్యాంకు సాధించిన అగ్రకుల అభ్యర్థికి ఓపెన్ కేటగిరిలో సీటు కేటాయించడం వాస్తవమా..కాదా? అని డాక్టర్ ఆలా వెంకటేశ్వరు ప్రశ్నించారు. యూనివర్సిటీ అడ్మిషన్ల నిబంధనల్ని పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. సమావేశంలో బీసీ సంఘ నాయకులు కేసన శంకరరావు, ప్రముఖ న్యాయవాది వైకే పాల్గొన్నారు.